సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 10 । జనవరి । 2025



తాగి రోడ్డెక్కితే..

మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై చట్టం కొరడా ఝుళిపిస్తోంది. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు.

- IVలో ▸



సంక్షేమ పథకాలను..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ అన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /9.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్యాకేజీ-21 పనుల పరిశీలన



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో కొనసాగుతున్న కాళేశ్వరం ప్యాకేజీ - 21 పనులను ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ అనిల్‌కుమార్ గురువారం పరిశీలించారు. సారంగపూర్, మంచిప్ప, బినోల తదితర ప్రాంతాల్లో సీఈ మధుసూదన్‌రావుతో కలిసి పర్యటించారు. పనుల వివరాలు తెలుసుకున్నారు. వారివెంట ఇరిగేషన్ ఎస్‌ఈలు బద్రీనారాయణ, యశస్విని, డిప్యూటీ సీఈ ప్రవీణ్, ఈఈలు, తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని బల్దియా కమిషనర్ దిలీప్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని బల్దియా కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో గురువారం రివ్యూ నిర్వహించారు. రెగ్యులర్ వసూళ్లతోపాటు మొండి బకాయిలను నిర్దేశిత లక్ష్యం మేరకు రోజువారీగా వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. విధుల్లో సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

18న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని ఈనెల 18న నిర్వహించేందుకు అధికారులు ఎట్టకేలకు కసరత్తు చేస్తున్నారు. 'బల్దియా సమావేశం జరిగేనా' శీర్షితో ఈనెల 7న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. చిట్టచివరి సమావేశం నిర్వహించేందుకు నగర మేయర్ నీతుకిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణతో మాట్లాడారు. ఆయా విభాగాలకు సంబంధించిన పనుల వివరాలు రిపోర్టులు ఇవ్వాలని కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త



ఖలీల్‌వాడి: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని, ఖరీదైన వస్తువులు, బంగారం, వెండితోపాటు నగదును ఇంట్లో ఉంచొద్దని సూచించారు. గ్రామాలు, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. గస్తీ దళాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితుల సమాచారం పోలీసులకు అందజేస్తే దొంగతనాల నివారణకు సహకరించిన వారవు తారని పేర్కొన్నారు.

22లోగా బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 22వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 23వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సందర్శించాలని సూచించారు.

31 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షలు, ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్, ఐఎంబీఏ ఏడు, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 12వరకు కొనసాగుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పలు పోటీ పరీక్షల నేపథ్యంలో 31వ తేదీకి వాయిదా వేసినట్లు కంట్రోలర్ పేర్కొన్నారు.

అత్యంత పవిత్రమైన ముక్కోటి ఏకాదశి

- ఉత్తర తిరుపతి క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రవచనం
- ఆలయాన్ని తీర్చిదిద్దిన నిర్వాహకులు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు



పాల్గొన్న భక్తులు



ప్రవచనాలు చేస్తున్న సచ్చిదానంద స్వామీజీ

విద్యుత్ దీపాల అలంకరణలో ఉత్తర తిరుపతిక్షేత్రం



నిజామాబాద్ రూరల్ : ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రమైనదని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం నిజామాబాద్ నగరంలోని గంగాస్థాన్‌లో ఉన్న ఉత్తర తిరుపతి క్షేత్రానికి వచ్చిన స్వామీజీ భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉపవాస దీక్షను పాటిస్తే పుణ్యఫలం లభిస్తుందన్నారు. వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు చేసుకోవాలన్నారు. స్వామీజీకి భక్తులు పూర్ణకుంభంతో, కోలాటంతో స్వాగతం పలికారు. నిర్వాహకులు ఉత్తర తిరుపతి క్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నందున తగిన ఏర్పాట్లు చేశారు.

పసుపు రైతులను ఆదుకుందాం



పసుపు రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి, పక్కన సభ్యులు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి
- స్పైసెస్‌బోర్డు సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి
- ఇక్కడ తక్కువ.. మహారాష్ట్రలో ఎక్కువ ధర లభిస్తోందన్న రైతులు

నిజామాబాద్‌అర్బన్: ఒడిదుడుకులను అధిగమిస్తూ పసుపు సాగు చేస్తున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కొండా లక్ష్మణ్ బాపూజీ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాజిరెడ్డి తదితరులతో కలిసి పసుపు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, స్పైసెస్ బోర్డు అధికారులతో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో అవగాహన సదస్సు నిర్వహించారు. సుగంధద్రవ్యాల బోర్డు ఆధ్వర్యంలో జిల్లాలో నెలకొల్పిన స్పైసెస్ బోర్డు ద్వారా పసుపు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును అధికారులు వివరించగా, రైతులకు తెలిసేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోదండరెడ్డి సూచించారు. ఒకే రకమైన పసుపునకు స్థానికంగా తక్కువ ధర చెల్లిస్తుండగా, పక్కనే ఉన్న మహారాష్ట్రలో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని సదస్సులో పాల్గొన్న రైతులు చైర్మన్ దష్టికి తెచ్చారు. కర్క్యుమిన్ ఆధారిత పసుపు మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని, నాణ్యమైన వంగడాలను, ఎలక్ట్రిక్ బాయిలర్లు, పాలిషింగ్ యంత్రాలను రాయితీపై అందించాలని, మార్కెట్ యార్డులో దళారీ వ్యవస్థ లేకుండా చేయాలని, పసుపు ధర నిలకడగా ఉండేలా చూడాలని రైతులు కమిషన్‌ను కోరారు. కూలీల కొరత నెలకొని పెట్టుబడి ఖర్చుపెరిగిందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని రైతులు కమిషన్‌కు విన్నవించారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. పసుపు రైతులు ప్రస్తావించిన అంశాలతోపాటు క్షేత్రస్థాయి పర్యటనలో తాము పరిశీలించిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. సదస్సులో కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పసుపు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ మండలాల్లో పర్యటించారు. కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన స్థానాన్ని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. పసుపు విత్తనాలతోపాటు బెడ్ సిస్టంలో పసుపు విత్తే యంత్రం, పసుపు తవ్వే యంత్రాలను పరిశీలించారు. మోర్తాడ్‌లో పసుపు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి అవసరమైన యంత్రాలు, ఇతర పరి కరాలను రాయితీపై అందించేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. పసుపు రైతులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కృషి చేస్తామన్నారు.



కమ్మర్‌పల్లిలో పసుపు తవ్వే యంత్రాన్ని పరిశీలిస్తున్న కోదండరెడ్డి

సాగులో నిబద్ధత



గోక భోజారెడ్డి, డొంకేశ్వర్

- ఏడాదిలో ఆరు రకాల పంటలు సాగు చేస్తున్న భోజారెడ్డి
- నాలుగు రకాల పంటలు పండిస్తున్న చిన్నారెడ్డి
- రసాయన ఎరువులను తగ్గించుకుంటూ వస్తున్న రైతులు



గడ్డం చిన్నారెడ్డి, నూత్‌పల్లి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సాధ్యమైనంతగా రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుంటూ, విడతలవారీగా సేంద్రియ ఎరువుల వాడకం వైపు వస్తున్నారు ఈ రైతులు. ఇష్టంగా వ్యవసాయం చేస్తూ సాగులో వైవిధ్యం చూపిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు ఈ ఇద్దరు రైతులు.

వ్యవసాయమే శ్వాసగా..

డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన గోక భోజారెడ్డి వ్యవసాయమే శ్వాసగా ముందుకెళుతున్నాడు. తనకు ఉన్న 12 ఎకరాల సాగుభూమిలో ఆరు రకాల పంటలను పండిస్తున్నాడు. వ్యవసాయాన్ని పండుగలాగా మార్చుకున్నాడు. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ ఉన్న భోజారెడ్డి డిగ్రీ చదివినప్పటికీ ఉద్యోగం, వ్యాపారం వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు ఇచ్చిన వ్యవసాయ భూమిని నమ్ముకుని వైవిధ్యంగా సాగు చేస్తున్నాడు. తల్లి పంటగా భావించే పసుపు పంటలో చాలావరకు సేంద్రియ ఎరువులనే వాడుతున్నాడు. మార్కెట్‌లో ధర దక్కినప్పటికీ, దక్కకున్నప్పటికీ పసుపు సాగును మాత్రం మానుకోలేదు. ఇప్పటికీ నాలుగు ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నాడు. మొత్తం 12 ఎకరాల భూమిలో ఒకే ఏడాదిలో పసుపు, మొక్కజొన్న, తెల్లజొన్న, వరి, కూరగాయలు, పుచ్చకాయ పంటలు సాగు చేస్తూ వస్తున్నాడు. పసుపు తవ్విన వెంటనే కూరగాయలు, పుచ్చకాయ పంటలు సాగు చేస్తున్నాడు. నాణ్యమైన పసుపు సాగు చేస్తూ మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో మాత్రమే మంచి ధరకు విక్రయిస్తున్నాడు.

సేంద్రియ ఎరువుతో..

డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం చిన్నారెడ్డి తనకున్న 12 ఎకరాల్లో నాలుగు రకాల పంటలు పండిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి పసుపు సాగులో సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నాడు. పసుపుతో పాటు వరి, మొక్కజొన్న, తెల్లజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. తగిన మెళకువలు పాటించి మంచి దిగుబడులు సాధిస్తూ లాభాలను ఆర్జిస్తున్నాడు. రానున్న రోజుల్లో ఆధునిక విధానంలో వ్యవసాయం చేసి కొత్త రకాల పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రైతు చిన్నారెడ్డి తెలిపాడు.

మీ కూతురును అరెస్టు చేశామంటూ ఫోన్..

- రూ.50వేలు పంపితే వదిలేస్తామంటూ సైబర్‌నేరగాడి డిమాండ్

ఇందల్వాయి: మీ కూతురిని అరెస్ట్ చేశాం.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, మీడియాకి ఈ విషయం తెలియకుండా ఉండాలంటే రూ.50వేలు ఆన్‌లైన్‌లో పంపాలని నకిలీ పోలీసు నల్లవెల్లికి చెందిన కుంట గంగారెడ్డి అనే వ్యక్తికి ఫోన్ చేశాడు. అమెరికాలో ఉంటున్న తన కూతురు ఇక్కడ ఎలా అరెస్టు అవుతుందని చాకచక్యంగా వ్యవహరించిన గంగారెడ్డి సైబర్ నేరగాడికి ధీటుగా సమాధానం ఇవ్వడంతో ఫోన్ కట్ చేశాడు. గంగారెడ్డి వెంటనే డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు. సైబర్ నేరగాడు గురువారం ఉదయం 923422 812353 నంబర్ నుంచి ఫోన్ చేసి తాను డీసీపీ విక్రమ్‌నంటూ మాట్లాడినట్లు గంగారెడ్డి తెలిపాడు.

మోస్ట్‌వాంటెడ్‌కు జ్యుడీషియల్ రిమాండ్

- రెండేళ్లుగా పరారీలో ఉన్న నిషేధిత సంస్థ పీఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు
- రూ.2 లక్షల రివార్డు ప్రకటించిన ఎన్ఐఏ

ఖలీల్‌వాడి : నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాలపల్లికి చెందిన మోస్ట్ వాంటెడ్ ఎండీ అబ్దుల్ అహాద్ అలియాస్ ఎంఏ అహాద్ బుధవారం నాంపల్లి కోర్టులో లొంగిపోగా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో ఉన్నాడు. 2022 జూలైలో ఆరోటౌన్ పోలీసులు నగరంలోని ఆటోనగర్‌లో పీఎఫ్ఐ శిక్షకుడు అబ్దుల్ ఖాదర్, పీఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాదుల్లాతోపాటు మరికొందరిని అరెస్ట్ చేశారు. వీరు అరెస్టు అయిన నాటి నుంచి అబ్దుల్ అహాద్ పరారీలో ఉన్నాడు. ఈ కేసు విషయమై అదే ఏడాది ఆగస్టులో అప్పటి సీపీ నాగరాజు ఎన్ఐఏ అధికారులకు లేఖ రాశారు. ఎన్ఐఏ అధికారులు పలుమార్లు జిల్లా పోలీసులతో కలిసి వివరాలను సేకరించారు. తీవ్రత దృష్ట్యా కేసును జిల్లా పోలీసుల నుంచి ఎన్ఐఏ అధికారులు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా తనిఖీలు చేసిన తర్వాత పీఎఫ్ఐని కేంద్రప్రభుత్వం నిషేధించిన విషయం తెలిసిందే. పోలీసులు నిఘా పెట్టినా రెండేళ్లుగా అతడి జాడ లేదు. జిల్లాలో పీఎఫ్ఐ కార్యకలాపాలను విస్తరించడంలో అబ్దు ల్‌అహాద్ క్రియాశీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. మాలపల్లిలోని అబ్దుల్ అహాద్ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించి కుటుంబసభ్యులకు నోటీసులు అందజేశారు. ఎన్ఐఏ 2023లో అహాద్‌ను మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చిరూ. 2లక్షల రివార్డును ప్రకటించింది. యువతను ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు ప్రేరేపించడం, తీవ్ర వాదులను తయారు చేయడం లాంటి ఆరోపణలు అహాద్‌పై ఉన్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ పలుసార్లు చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. ఇదిలా ఉండగా నేరుగా అబ్దుల్ అహాద్ హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపోయారు. లొంగిపోయిన అబ్దుల్‌అహాద్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అబ్దుల్‌అహాద్ పరారీలో ఉన్నప్పుడు ఎక్కడెక్కడ తిరిగారు. షెల్టర్ ఎవరు ఇచ్చారు అనే కోణంలో ఎన్ఐఏ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ..

- వాహనదారులు హెల్మెట్ ధరించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంవీ చట్టం ప్రకారం కేసులు
- జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల్లో కలెక్టర్ హనుమంతు, జడ్జి సునీత



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా జడ్జి సునీతాకుంచాల



హెల్మెట్ ధరించని వాహనదారుడికి గులాబీపూలు ఇస్తున్న దృశ్యం

ఖలీల్‌వాడి: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు – 2025 అవగాహన ర్యాలీ గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, న్యాయమూర్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి గులాబీపూలు అందజేసి హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం కేసు నమోదవుతాయని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రారంభమైన బైక్ ర్యాలీ కోర్టు చౌరస్తా, తిలక్ గార్డెన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, దేవీరోడ్డు, నెహ్రూ పార్కు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకుంది. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, న్యాయమూర్తులు శ్రీనివాస్‌రావు, ఖుష్బు ఉపాధ్యాయ, గోపీకృష్ణ, డీసీపీ(అడ్మిన్) జి బస్వారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ దుర్గాప్రమీల, డీటీవో ఉమామహేశ్వరరావు, ఆర్మూర్, బోధన్ ఎంవీఐలు జి వివేకానందరెడ్డి, కె అజయ్‌కుమార్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మంజా వాడితే ఐదేళ్ల జైలు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పతంగులు ఎగురవేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. చైనా మాంజా వాడొద్దని, వాడిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు. చైనా మాంజా నిల్వ చేసినా, అమ్మినా, అమ్మడానికి ప్రోత్సహించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చైనా మాంజాతో ప్రజలతోపాటు పక్షులు, జంతువులు ప్రమాదం పొంచి ఉందన్నారు.

క్లుప్తంగా

భద్రత నడుమ మరమ్మతులు చేపట్టాలి



నిజామాబాద్‌అర్బన్‌: ఈవీఎంలు భద్రపర్చి న గోదాములో అవసరమైన మరమ్మతుల ను కట్టుదిట్టమైన భద్రత నడుమ చేపట్టాలని కలె క్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారు లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగ ర్‌లో ఉన్న ఈవీఎం గోదామును గు ర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధు ల సమ క్షంలో గురువారం సందర్శించారు. ఈవీఎం లు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రి భద్రపర్చిన గదులను పరిశీలించారు. మరమ్మ తుల పనులను నాణ్యతతో చేపట్టి నిర్దిష్ట గడు వులోగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఈఈ శంకర్‌కు సూ చించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సం బంధిత శాఖల అధికారులు ఉన్నారు.

లయన్స్ కంటి ఆస్పత్రికి రూ. 25 లక్షల విరాళం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని లయన్స్ కం టి ఆస్పత్రి అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే కేవీ రెడ్డి మనవడు వెంకట్ ప్రభురెడ్డి దంప తులు రూ.25 లక్షలను విరాళంగా వితరణ చేశారు. గురువారం సంబంధిత చెక్కును ఆస్పత్రి ప్రతినిధులకు అందజేశారు. ఆస్పత్రి ఫౌండర్ బస్వేశ్వర్‌రావ్, ప్రతినిధి కోడాలి కిశో ర్‌కుమార్ లు మాట్లాడుతూ.. అమెరికాలో స్థిర పడినా లయన్స్ కంటి ఆస్పత్రిని కేవీ రెడ్డి కుటుంబ సభ్యులు అన్ని విధాలుగా అదుకో వడం అభినందనీయం అన్నారు. క్లబ్ ప్రతి నిధులు ఉమేష్ షిండే, నాగేశ్వర్‌రావ్, ప్రతాప్ గుప్తా, తదితరులు ఉన్నారు.

ట్రైబల్ ఎంపవర్మెంట్ ట్రైనింగ్‌కు జిల్లా నేత



నిజామాబాద్ రూరల్: నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్‌లో టీఆర్‌ఐసీవోఆర్ ఆధ్వ ర్యంలో జరుగుతున్న ట్రైబల్ ఎంపవర్మెంట్ ట్రైనింగ్‌లో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఛైర్మన్ కేతవత్ యాదగిరి గురువారం పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం జనవరి 4నుంచి 11వరకు జరుగుతుందని ఆయన తెలి పారు. తెలంగాణలోని ఆదివాసి పౌరుల జీవన స్థితిగతులను పూర్తిగా అవగాహన చేసుకుని వారి జీవితాలను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలు ప్రభుత్వం తరఫున రూపొందించవలసిన పథకాల గురించి ఒక అవగాహన ఏర్పడడానికి ఉపయోగపడుతుం దన్నారు. నాయకులు రాణా ప్రతాప్, నరేష్ రాథోడ్, వినోద్, మదన్, ప్రకాష్ పాల్గొన్నారు.

బీరు బాటిల్‌లో వ్యర్థాలు



రుద్రూర్: పోతంగల్‌లోని ఓ వైన్స్‌లో కొనుగోలు చేసిన బీరు బాటిల్‌లో వ్యర్థ పదార్థాలు వచ్చాయని కొనుగోలు దారుడు మల్లికార్జున్ ఆరోపించాడు. మంగళవారం రాత్రి బీరు కొని ఇంటికి తీసుకెళ్లి కొద్దిగా తాగడంతోనే వాంతులై అస్వస్థతకు లోనైనట్టు తెలిపారు. బాటిల్‌లో వ్యర్థాలు ఉన్నట్టు గుర్తించి వైన్స్‌లో తెలి యజేస్తే నిర్లక్ష్య దోరణి ప్రదర్శించారన్నారు. ఈ విషయమై గురువారం బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు మల్లికార్జున్ తెలిపారు.

సాగు యంత్రాలతో రైతులకు మేలు

- గదిలో పెట్టిస్తే ఏం ఉపయోగం
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి
- అధికారుల తీరుపై అసహనం



మోర్తాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

కమ్మర్‌పల్లి/మోర్తాడ్/బాల్కొండ: వ్యవసాయ సాగులో రైతులకు నూతన పద్ధతులు, పనిముట్లు, యంత్రాలను క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా చూపిస్తేనే ప్రయోజనం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి పేర్కొ న్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు ప రిశోధన స్థానాన్ని గురువారం ఆయన రాష్ట్ర విత్తనా భివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా వ్యవసాయ యం త్రాలను, పసుపు విత్తనాలను పరిశీలించారు. బెడ్ సిస్టంలో పసుపు విత్తే యంత్రం, పసుపు తవ్వే యం త్రంను పరిశీలించారు. ఈ యంత్రాల పనితీరును శాస్త్రవేత్తలు మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా చూపించారా అ ని ప్రశ్నించారు. నాలుగు గోడల మధ్య ఉంచితే రై తులకు ఉపయోగ పడతాయో లేదో ఎలా తెలుస్తుం దని అసహనం వ్యక్తం చేశారు. యంత్రాలను రైతు లు ఉపయోగించుకుంటేనే సరైన ఫలితాలు సాధ్య మవుతాయన్నారు. పసుపు పంటకు ధర రావాలం టే ఎటువంటి చర్యలు చేపడితే రైతుకు ఉపయోగ పడుతుందని శాస్త్రవేత్తలను అడిగారు. అధిక కుర్కు మిన్ కలిగిన విత్తనాలను సాగు చేస్తే మంచి ధర వ స్తుందని శ్రీకొండలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. ఇక్కడి రైతులు ఏ రకం విత్తనాలతో పసుపు సాగు చేస్తు న్నారని అడుగగా, ఎర్ర గుంటూర్, దుగ్గిరాల ఎరు పు తదితర రకాలను సాగు చేస్తున్నారని తెలియజే శారు. రైతులు సాగు చేస్తున్న విత్తనాల్లో అధికంగా కుర్కుమిన్ శాతాన్ని అభివృద్ధి చేయాలని సూచిం చారు. పసుపు పరిశోధన స్థానంలో కోదండరెడ్డితో రైతుల ముఖాముఖి కార్యక్రమ ఉంటుందని పరిశో ధన స్థానం శాస్త్రవేత్తలు ప్రకటన చేశారు. కానీ కో దండరెడ్డి రైతులతో చర్చించకుండానే వెళ్లిపోవడం తో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మోర్తాడ్‌లో పసుపు సాగు చేస్తున్న రైతులతో ఆయ న మాట్లాడారు. వ్యవసాయానికి అవసరమైన యంత్రాలు, ఇతర పరికరాలను రాయితీపై అందిం చేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని హామీ ఇ చ్చారు. అలాగే మెండోరా మండలం బుస్సాపూర్ లో పసుపు పంటను పరిశీలించారు. పసుపు పరిశో దన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు కనిపించడం లేదని వారిపై మండిపడ్డారు. పసుపు రైతులకు పూర్వ వైభవం తీసుకురావాడాని కి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి జరుగుతుం దన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, అధనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్‌డీ వో రాజాగౌడ్, రైతు కార్పొరేషన్ అధ్యక్షుడు గడుగు గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ నర్సయ్య, ముత్యంరెడ్డి, డీసీసీఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



బుస్సాపూర్‌లో పసుపును పరిశీలిస్తున్న కోదండ రెడ్డి, అన్వేష్‌రెడ్డి

ప్రయోగ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి



విద్యార్థుల ప్రయోగశాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్ అధికారి రవికుమార్

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల ప్రయోగ పరీక్షల కు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశా ఖాధికారి రవికుమార్ అన్నారు. నగరంలోని వాణి వొకేషనల్ ప్రైవేటు జూనియర్ కళాశాలను గురువా రం ఆయన తనిఖీ చేశారు. కళాశాల యాజమాన్యం తో ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధ నల మేరకు కార్యాలయ రిజిస్టర్లన్నీ పూర్తి చేయాల ని ఆదేశించారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేం దుకు, సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫోటో సంతక ము తప్పిదం సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని, డేటాను సారి చేసి కం ప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధన లను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలి



మోర్తాడ్ కళాశాలలో మాట్లాడుతున్న అధికారులు

మోర్తాడ్: వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థు లు చదువుకోవాలని, అలాగే అధ్యాపకులు అందు కు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించా లని హైదరాబాద్ డీఐఈవో, జిల్లా ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న సూచించారు. మోర్తాడ్ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. కళాశాల ఆవరణలో ప్రత్యేకాధికారి మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- తెయూ వీసీ టి యాదగిరిరావు



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు క్యాంపస్‌తో పాటు తాము ఉంటున్న హాస్టల్స్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెయూ వీసీ టి యాదగిరి రావు సూచించారు. గురువారం తెయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 4 సంయుక్త ఆధ్వర్యంలో న్యూ బాయ్స్ హాస్టల్ ప్రాంగణం లో నిర్వహించిన క్లీన్ ఇండియా ప్రోగ్రాంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని వలంటీర్లతో కలిసి హాస్టల్ పరిసరాల్లో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిరంతరం కొన సాగించాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి వివరించారు. పర్యావరణ పరి రక్షణ, సామాజిక బాధ్యతపై ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కె రవీందర్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, స్రవంతి, వలంటీర్లు పాల్గొన్నారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌లు ఆన్‌లైన్ నుం చి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతిరో జూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గం టల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గం టల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని ఒకరి మృతి



రోడ్డుపై పడిపోయిన రవీందర్

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలో ఓ వ్యక్తి బైక్ ఢీకొని మృతిచెంది నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గుండారం గ్రామానికి చెందిన కోటిపల్లి రవీందర్(58) గ్రామ శివా రులో ఉన్న పసుపు గిర్నిలో పని ముగించుకుని బుధ వారం సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. ఈక్రమం లో వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ అతడిని ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడం తో స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టి నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపారు.

పొలంలో ఫిట్స్ వచ్చి రైతు..

ఎడపల్లి(బోధన్): పంటపొలంలో ఎరువు వేయడా నికి వెళ్లిన ఓ రైతు ఫిట్స్ వచ్చి మృతిచెందాడు. వివ రాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు గురువారం ఎరువు సంచి నెత్తిన పెట్టు కొని పొలం గట్టు వెంట వెళ్లాడు. అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కింద పడ్డాడు. నెత్తిన వున్న ఎరువు సంచి తలపై పడడంతో ఊపిరాడక అక్కడి క్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప ట్టారు.

చికిత్స పొందుతూ బాలిక..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) ఈ నెల 5న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పదో తరగతి చదువుతున్న సదరు బాలికను ఓ వ్యక్తి ఫోటోలు తీశాడనే కారణంతో మనస్తాపం చెంది గడ్డిమందు తాగింది. వెంటనే కుటుంబసభ్యులు బాలికను చికిత్స కోసం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నేరస్తుడిని రిమాండ్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరం జీవి తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వారికి రెండేళ్ల జైలు

మోపాల్: మండలంలోని శివలాల్ తండాలో 2017లో నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు చేస్తుండగా పలువురు వారి విధులకు ఆటంకం కలిగించారు. ఎస్సై సతీష్ ఆధ్వర్యం లో దాడులు చేసి నాటుసారా, నల్లబెల్లం స్వా దీనం చేసుకోగా నలుగురు వ్యక్తులు అడ్డుకు న్నారు. ఈ విషయంలో అప్పుడే నలుగురిపై కేసులు నమోదు కాగా కోర్టులో విచారణ జరి గింది. అనంతరం గురువారం జడ్జి నలుగురి (కేతావత్ గోకుల్, గుగులోత్ దేవేందర్, కేతా వత్ లక్ష్మీబాయి, కేతావత్ తిరుపతి)కి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తు తీర్పు వెల్లడించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి 5రోజులు..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన సుమన్ బుధవారం రాత్రి మద్యం తాగి స్థానికులను ఇబ్బందిపెట్టాడు. దీంతో పోలీసులు అతడిని న్యూసెన్స్ కేసు కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా గురువారం అతడిని ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి ఐదు రోజుల సాధారణ శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అర్ధరాత్రి వరకు హోటల్ నడిపిన వ్యక్తికి ఒకరోజు..

ఖలీల్‌వాడి: నగరంలోని బాబన్‌షహన్‌పహాడ్‌కు చెందిన అబ్దుల్ హఫీ(19) అర్ధరాత్రి వరకు టీపాయింట్ షాప్‌ను నిర్వహించడంతో పోలీ సులు అతడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. గురువారం అతడిని సెకండ్‌క్లాస్ మెజి స్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగా ధర్ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 3రోజులు..

ఇందల్వాయి:మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవ ల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేప ట్టగా నాందేడ్ జిల్లా ముద్కెడ్‌కి చెందిన గోపాల్ మోరే పట్టుబడ్డాడు. అతడిని గురువారం ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి అహ్మద్ మొయి నొద్దిన్ మూడు రోజు ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

ముగ్గురికి జరిమానా..

రుద్రూర్: మండల కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి బోధన్ న్యాయమూర్తి శేషతల్ప సాయి జరిమానా విధించినట్టు ఎస్సై సాయ న్న గురువారం తెలి పారు. రుద్రూర్‌లో బుధవారం రాత్రి వాహ నాలను తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను అదు పులోకి తీసుకున్నారు. వారిని గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా మనోజ్‌కు రూ.12వేలు, సాయిలుకు రూ. 4వేలు, అంజీ బాబుకు రూ. 3వేల జరిమానను జడ్జి విధిం చినట్టు వివరించారు.

పొలాన్ని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని సాటాపూర్ గేట్ సమీపంలో జమీల్ అనే వ్యక్తికి చెందిన పంటపొలాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసున మోదు చేసినట్టు బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు గురువారం తెలి పారు. వివరాలు ఇలా.. సాటాపూర్ గేట్ సమీపంలోని ఓ పంటభూమి విక్రయం వివాదస్పందంగా మారింది. ఈ భూమిలో జమీల్ అనే రైతు వరినాటారు. నాటిన వరిపంటను జేసీబి సహాయంతో కొంత మంది వ్యక్తులు (అశ్వక్, అతిక్, తమీమ్) ధ్వంసం చేశారు. దీంతో జమీల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని అడ్డుకొని, కేసు నమోదు చేశారు. జేసీబీని సీజ్ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



మాచారెడ్డి: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. పాల్వంచ మం డలం వాడిలో ఒకటి, మండల కేంద్రం లో మరో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వివరించారు. అను మతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇందల్వాయి మండలంలో..



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామ శివారు లో గురువారం ఉదయం అక్రమంగా మొరం తరలిస్తున్న రెం డు టిప్పర్లను పట్టుకొని తహసీల్దార్ వెంకట్‌రావుకి అప్పగించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. మం డలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక,మొరం తవ్వకాలు జరి గితే పోలీసులకు సమాచా రం అందించాలని ఎస్సై సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిఖ్ అన్సారీ



జిల్లా కలెక్టర్‌తో సమావేశం నిర్వహిస్తున్న మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిఖ్ అన్సారీ

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిఖ్ అన్సారీ సూచించారు. జిల్లా కేంద్రానికి గురువారం ఆయన విచ్చేయగా, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు జిల్లా అధికారు లతో భేటీ అయ్యారు. జిల్లాలో మైనారిటీ వర్గాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించేలా జిల్లా యంత్రాంగం తరఫున చొరవ చూపాలన్నారు. బాల్కొండ మం డలం జలాల్పూర్, వేల్పూరు లలో ముస్లిం స్మశాన వాటిక స్థలాలు ఆక్రమణకు గురైనట్లు కమిషన్ దృ ష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, కమ్మర్పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో చర్చి నిర్మాణానికి నిబంధనల మేరకు అనుమతులు మం జూరు చేయాలన్నారు. సారంగాపూర్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరిగే ఇజ్తెమాకు తగిన సౌక ర్యాలు ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ కమి షనర్ దిలీప్‌కు సూచించారు. అనంతరం మైనారిటీ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా మైనా రిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, నిజామా బాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- జిల్లా వైద్యసిబ్బందితో సమావేశం





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి రాజ్యశ్రీ, పాల్గొన్న వైద్య సిబ్బంది

నిజామాబాద్ నాగారం: ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సూచించారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్ వో కార్యాలయంలో గురువారం వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఆమె సమీక్ష సమావేశం ని ర్వహించారు. ఈసందర్భంగా రాజశ్రీ మాట్లాడు తూ.. సిబ్బంది ప్రభుత్వ నియమ నిబంధనలకు అ నుకూలంగా పనిచేయాలని, సమయపాలన పాటి స్తూ వైద్యసేవలు అందించాలన్నారు. జిల్లా ఉప వై ద్యాధికారులు, వైద్యాధికారులు ఆరోగ్య ఉప కేంద్రా లను, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను, పల్లె దవాఖానాలను, బస్తీ దవఖానాలను క్రమం తప్ప కుండా పర్యవేక్షించాలన్నారు. మాతృ మరణాలపై, శిశు మరణాలపై, ఐదు సంవత్సరాలలోపు చిన్నపి ల్లల మరణాలపై ఆశలు, ఏఎన్‌ఎం, పర్యవేక్షక సి బ్బందితో ప్రతినెల సమీక్షించాలని కోరారు. ప్రభు త్వ ఆస్పత్రిలో ప్రసవాలను పెరిగేలా చూడాలని, వ్యాధి నిరోధక టీకాలను, అసంక్రమిక వ్యాధుల ని ర్ధారణ పరీక్షలను, ప్రసవానికి ముందు ప్రసవానం తరం అంబులెన్స్ సేవలను ఉపయోగించుకునేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మరింత ఆరోగ్య సేవలకై సమాచారాన్ని సేకరిస్తూ సకాలంలో నివేదికలు అం దజేయాలన్నారు. వైద్యాధికారులు రమేష్, రాజు, అశోక్, తుకారం రాథోడ్, వినీత్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కాంస్యం



ట్రోఫీ అందుకున్న రాష్ట్ర జట్టు క్రీడాకారులు

రాణించిన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: మహారాష్ట్రలో ఇటీవల నిర్వ హించిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాం స్య పతకం సాధించింది. జట్టులోని జిల్లా క్రీడాకా రులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అండర్-17 విభాగంలో తృతీయ స్థానం కోసంహర్యానా జట్టుతో తలపడిన రాష్ట్ర జట్టు 03-05 తేడాతో విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ, పతకాలు అందుకున్నారు.

ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు సాంబార్ నిత్యశ్రీ(జెడ్పీహెచ్‌ఎస్ తొర్లికొండ), అశ్వి ని(జెడ్పీహెచ్‌ఎస్ ముచ్కూర్), గోక సాత్విక, గోక శ్రావిక (సుద్దపల్లి గురుకుపాఠశాల)ను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి అభినందిం చారు. జట్లకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, వినోద్ కుమార్, అంజలి, ప్రశాంత్ కుమార్‌లు వ్యవహరించారు.

రాష్ట్ర టోర్నీకి తరలిన జిల్లా జట్టు



నిజామాబాద్‌నాగారం: వరంగల్ జిల్లా గీసిగొం డలో ప్రారంభమైన తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు క్రీడాకారులు గురువారం తరలివెళ్లారు. గీత కాన్వెంట్ కరెస్పాండెంట్ సాగర్, అదేవిధం గా జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ గంగసాగర్ క్రీడాకారులకు దుస్తులు వితరణ చేశారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ బిల్లా అనిల్, అధ్యక్ష కార్యదర్శులు జీవీ భూమారెడ్డి, ఎండీ అతీక్‌ల్లా, జాయింట్ సెక్రెటరీ సుజాత గారు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరావు, కోచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- జిల్లా విద్యాశాఖాధికారి అశోక్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మోర్తాడ్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ ది శగా పయనించాలని డీఈవో అశోక్ అన్నారు. గురు వారం మండలంలోని సుంకేట్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లా డారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మెరుగు పడిందని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప దో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈ వో సమ్మిరెడ్డి, హెచ్‌ఎం సంతోష్ కుమార్, ఉపాధ్యా యులు, నాయకులు పాల్గొన్నారు.

రికవరీ ఫోన్ల అందజేత

ఆర్మూర్ టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందించి నట్లు ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితులకు అందించినట్లు పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారా యణ, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కమాలా నెహ్రూకాలనీ సమీపంలోని హైవే ఓ వృద్ధుడు హత్యకు గురైన ఘ టన గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలి పిన వివరాలు ఇలా.. పట్టణంలో మైలారపు సోమే ష్(60) ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకొని, వాటిని విక్ర యిస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగ బుధవారం అర్ధ రాత్రి కనపర్తి రాజు, కనపర్తి సత్యనారాయణ, బడె రవి అనే యాచకులు సోమేష్‌తో డబ్బుల విషయం లో గొడవ పట్టారు. ఆవేశానికి గురైన ముగ్గురు సోమేష్‌ను ధృడమైన ఆయుధంతో చితకబాదారు. తీవ్రగాయాలు కావడంతో సోమేష్ మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు.

పశువుల కాపరి అదృశ్యం



బండి నర్సింలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండ లంలోని లింగంపల్లి గ్రామాని కి చెందిన బండి నర్సింలు అ నే పశువుల కాపరి అదృశ్యమై నట్లు ఎస్సై సుధాకర్ తెలిపా రు. నర్సింలు ఈనెల 8న ఉద యం పశువులను మేతకోసం స్థానిక అటవీప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం మేతకు వెళ్లిన పశువులు తిరిగి ఇంటికి రాగా, నర్సిం లు రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి అచూకీ లభించలేదు. దీంతో నర్సింలు భార్య సావిత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి నట్లు పోలీసులు తెలిపారు.

కామారెడ్డిలో ఒకరు..



మహమ్మద్ అజీజ్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం లోని బడా కసాబ్‌గల్లీకి చెం దిన మహమ్మద్ అజీజ్(35) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్ట ణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. అ జీజ్ పెయింటర్‌గా పని చేస్తూ జీవిస్తుండగా గత సెప్టెంబర్ 30న ఇంటి నుంచి బ యటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబస భ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి తల్లి రూబియా పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్లుప్తంగా

ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సాయం



బాన్సువాడ: న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం అందించాలని బాన్సువాడ కోర్టు జడ్జి టీఎస్పీ భార్గవి అన్నారు. గురువారం బాన్సువాడ కోర్టులో బార్ అసోసియేషన్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో న్యాయ సేవాధికార సంస్థకు సంబంధించిన విషయాల గురించి చర్చించారు. జడ్జి మాట్లాడుతూ.. న్యాయ సహాయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్ లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు ఖలీల్, మోహన్‌రెడ్డి, మొగులయ్య తదితరులున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం అప్పగించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన షారుక్ ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ ద్వారా గుర్తించి అప్పగించారు.

ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



నిజాంసాగర్(జుక్కల్): బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ సహకారంతో మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన బోరు మోటార్ల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కోరినట్లు బీజేపీ నాయకులు రాంప్రసాద్, గోర్గంటి రాములు, సాయిబాబా తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తరలిన క్రీడాకారులు



కామారెడ్డి టౌన్: మహారాష్ట్రలో ఈ నెల 13 వరకు జరిగే 68వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ జట్టు తరపున క్రీడాకారులు గురువారం కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి తరలివెళ్లారు. గత ఏడాది నవంబర్ 3 నుంచి 5 వరకు సదాశివనగర్ మండలం పోసానిపేట గ్రామంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను నిర్వహించి తెలంగాణ టీంను ఎంపిక చేశారు. అండర్–14 బాలికల విభాగంలో శ్రీలత, స్నేహ, వైష్ణవి, అలేఖ్య, వర్షిత, నేహ, శ్రీనిధి, నవ్యశ్రీ, భావన, తనూజా, సహస్ర, అంజలిలు తెలంగాణ జట్టు తరపున జాతీయ స్థాయి పోటీలో పాల్గొననున్నారు. జట్టుకు కోచ్‌గా కోచ్‌గా నరేష్ రెడ్డి, మేనేజర్‌గా ప్రతిభలు వ్యవహరించనున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని విద్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రోటరీ ఆడిటోరియంలో కాలనీ మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఎంజీ.గీత, ద్వితీయ బహుమతి కె.మానస, తృతీయ బహుమతి ఎం.లావణ్య, ప్రత్యేక బహుమతి ఎం.షీలా గెలుపొందారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వంద మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. బహుమతుల దాతలు ఎం.రాజేశ్వర్, మోతే వెంకటేష్‌గౌడ్‌లను అసోసియేషన్ అధ్యక్షుడు మారవేణి రాజన్న అభినందించారు. వైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కాలనీ కార్యదర్శి వి.విశ్వనాథం, కోశాధికారి పార్శి వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఎ.బాలకిషన్, బి.మురళి, మోహన్‌లాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్ పాఠశాలలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు సంజీవ్‌రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు.

మాచారెడ్డి ప్రాథమిక పాఠశాలలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటాచారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అశోక్ కుమార్, తదితరులు ఉన్నారు.

త్వరలో ‘భూ భారతి’ అమలు!

- ఆమోదం తెలిపిన గవర్నర్
- నూతన చట్టం విధానాలు



నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో భూ భారతి చట్టం అమలులోకి రానుంది. ఈ చట్టానికి ఇటీవల గవర్నర్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ధరణి రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వస్తుంది. నూతన చట్టాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో కొత్త విధానంలో ఏ అంశాలు ఏలా ఉన్నాయో తెలుసుకుందాం. ధరణి పోర్టల్ పేరును భూ భారతిగా మార్చారు. వారసత్వ బదిలీ మినహా అన్ని లావాదేవిల్లో ఏకకాల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సేవలు కొనసాగనున్నాయి. మ్యుటేషన్‌పై అభ్యంతరాలను సైతం సేకరించేల అప్పీలకు అవకాశం ఇచ్చారు.

పట్టా భూముల సమస్యలు

భూ భారతి పోర్టల్‌లో భూముల లావాదేవిలకు అనుమతి ఇస్తారు. సాగులో ఉండి హక్కులకు రాని వాటికి హక్కులు కల్పిస్తారు. ఆర్‌వోఆర్ 1971 కింద పాస్‌పుస్తకాలు ఉన్నవారికి కొత్త చట్టంలోని హక్కులు కల్పిస్తారు. ఖాతాలో తేడాలు, సర్వే నంబర్‌లో తప్పులు, రికార్డుల్లో భిన్నంగా సాగు వేరే చోట ఉండడం, తదితర సమస్య ఉన్నప్పటికి అసలు సాగుదారుల పేరు మీద హక్కులు కల్పిస్తారు.

పార్ట్– బి వివాదాలు

హద్దులు, సమస్యలు, సర్వేలో లోపాలు, చిన్నచిన్న వివాదాలు, మ్యుటేషన్ ఫిర్యాదులు వంటివి అధికారులు విచారణ చేపడుతారు. దీనికి కోసం మూడు రకాల పరిష్కార మార్గాలను కల్పించారు. సులభతరంగా ఉన్న సమస్యలను తహసీల్దార్ స్థాయిలో మధ్యస్తంగా ఉన్న సమస్యలను ఆర్‌డీవో స్థాయిలో, తీవ్రస్థాయిలో ఉన్న సమస్యలను కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా సెక్షన్లు ఏర్పాటు చేశారు. సుమారు 23 రకాల భూ యజమాన్యాలకు సంబంధించిన పరిష్కారాలు చూపారు. ఈ నేపథ్యంలో అభ్యంతరాలు తలెత్తితే అప్పీలు చేసుకునే అవకాశం ఉంది.

వారసత్వ బదిలీ

పాత చట్టంలా కాకుండా భూ భారతిలో వారసత్వ బదిలీపై కుటుంబ సభ్యులకు తహసీల్దార్ నోటీసులు జారీ చేస్తారు. విచారణ జరిపి మ్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలుకు అవకాశం ఉంటుంది.

అసైన్డ్ భూములకు పట్టాలు

అసైన్డ్, లావణీ తదితర భూములకు సంబంధించి ఇందులో అవకాశం ఉంది. గతంలో వీటికి పాస్‌పుస్తకాలు జారీ చేయలేదని గుర్తించారు. తాజాగా రైతులు దరఖాస్తులు చేసుకోకున్న పట్టాపాస్‌పుస్తకాలు అయితే జారీ చేస్తారు. అవసరమైతే విచారణ జరుపుతారు.

అప్పీళ్ల వ్యవస్థ

18 రకాల భూములకు సంబంధించి యజమాన్య హక్కుల మార్పిడిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కోర్టుకు వెళ్లకుండా నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. 18 రకాల భూముల్లో ఆరు తహశీల్దార్, మిగిత భూములకు ఆర్‌డీవో మ్యుటేషన్ పూర్తి చేస్తారు. అంతేకాకుండా అభ్యంతరాలపై అప్పీలు పోయే అవకాశం కల్పించారు. తహసీల్దార్‌పై ఆర్‌డీవోకు, ఆర్‌డీవోపై కలెక్టర్‌కు, కలెక్టర్‌పై ల్యాండ్ ట్రిబ్యునల్ వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది.

మ్యుటేషన్‌పై..

ఒకరి చేతిలో భూములు ఉండగా రికార్డుల్లో పాత యజమానుల పేర్లు ఉంటే అడ్డుకోవచ్చు. మ్యుటేషన్‌ను రద్దుచేసే అవకాశం ఆర్‌డీవోకు ఉంటుంది. అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. రిజిస్టర్ దస్తావేజుల ద్వారా జరిగిన మ్యుటేషన్లలో తప్పులు ఉన్న ఆర్‌డీవోకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుంది.

కొత్త పాస్‌పుస్తకాల జారీ విధానం

రక్షిత కౌలుదారులకు, ఇనాం భూములకు ధ్రువీకరణ పత్రం ఇచ్చే అధికారాలు కలెక్టర్‌కు కల్పించారు. వేరువేరు చట్టాల ద్వారా హక్కులు దాఖలు పడిన సమయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆర్‌డీవో పాస్‌పుస్తకాలను జారీ చేస్తారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను తహశీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్లకు అప్పగించారు. అంతేకాకుండా క్రిమినల్, శాఖ పరమైన చర్యలు పాత చట్టం ప్రకారం కొనసాగుతాయి. ఈ చట్టం ద్వారా పాస్‌పుస్తకాల రద్దు కలెక్టర్‌కు అప్పగించారు.

కులమతాలకు ప్రతీక బడాపహాడ్


బడా పహాడ్ దర్గా



స్వాగత ద్వారం

- 11నుంచి ఉర్సు ప్రారంభం
- ఏర్పాట్లపై దృష్టిసారించని నిర్వాహకులు

వర్ని: ఉత్తర తెలంగాణలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన బడాపహాడ్ దర్గా కులమతాలకు ప్రతీకగా నిలుస్తోంది. వర్ని మండలం జలాల్పూర్ అటవీప్రాంతంలో దట్టమైన గుట్టల్లో కొలువై ఉన్న షాదుల్లా బాబా దర్గాను హిందూవులు, ముస్లింలు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. ప్రసిద్ధమైన ఈ దర్గాలో ఈనెల 11నుంచి ఉర్సు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది దర్గా వద్ద మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈక్రమంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు వెల్లడించారు. కానీ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి ఏటా దర్గా ద్వారా వక్ఫ్ బోర్డుకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యంగానే ఉంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో బోర్డు పూర్తిగా విఫలమైంది. వచ్చిన ఆదాయంలో 75% నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని నిబంధనలో ఉన్నప్పటికీ కనీసం 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉర్సు సమయంలోనే తూతూ మంత్రంగా నిధులు మంజూరు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

బలవంతపు వసూళ్లు..

దర్గాకు వచ్చే భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. వసతి కొరకు తీసుకున్న షెడ్ల దగ్గర నుంచి మేకలు కోయడం, దేవునికి నైవేద్యం సమర్పించడం, తలనీలాలు సమర్పించడం, కొబ్బరికాయలు, తాగునీరుకు సైతం డబ్బులు చెల్లించనిదే ఇక్కడ ఏ పని జరగదు. దర్గా వద్ద నైవేద్యం సమర్పించడానికి పూజారులు భక్తుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఏ చిన్న వస్తువు కొనాలన్నా 100శాతం అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయంలో జోక్యం చేసుకొని తగిన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


బడాపహాడ్

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


ఎల్లారెడ్డిలో మాంజాను పరిశీలిస్తున్న ఎస్సై మహేష్


భిక్కనూరులో పరిశీలిస్తున్న ఏఎస్సై జగదీష్

ఎల్లారెడ్డి: చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో పతంగులు విక్రయిస్తున్న దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాలలో అమ్ముతున్న మాంజాను ఆయన పరిశీలించారు. దుకాణాలలో చైనా మాంజా విక్రయించొద్దని, దీని వల్ల ప్రజలతో పాటు, పక్షులు, జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని అన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలో పతంగులు విక్రయించే దుకాణాలను భిక్కనూరు ఏఎస్సై జగదీష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా విక్రయించవద్దని సూచించారు.

నిజాంసాగర్(జుక్కల్): చైనా మాంజాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ హెచ్చరించారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలోని పతంగుల విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. మామూలు దారాలను విక్రయించాలని సూచించారు.


జుక్కల్‌లో ఎస్సై భువనేశ్వర్..

తాగి రోడ్డెక్కితే కటకటాలపాలే..!

- జిల్లాలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- 2024లో 7,698 కేసులు.. 165 మందికి జైలు శిక్ష



మూడేళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానాలు	జైలు శిక్ష
2022	12,080	1,63,57,994	20
2023	8,706	77,89,089	14
2024	7,698	88,90,451	165

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై చట్టం కొరఢా ఝుళిపిస్తోంది. పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతుండగా, న్యాయస్థానాలు సైతం జరిమానా, జైలు శిక్షలు విధిస్తున్నాయి. మందుబాబులపై చట్టం కఠినంగా వ్యవహరిస్తున్నా కొందరు మారడం లేదు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2024లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 7698 నమోదు కాగా, 165 మందికి ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజుల ఇలా జైలు శిక్షలు ఖరారయ్యాయి. రూ.88.90 లక్షల జరిమానా విధించారు. 2023లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 14 మంది జైలు శిక్ష పడగా, 2024లో ఆ సంఖ్య 151కి చేరడం గమనార్హం.

రోడ్డు ప్రమాదాల్లో 335 మంది మృతి

మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జిల్లాలో ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. 2024లో కమిషనరేట్ పరిధిలో 322 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 335 మంది మృతి చెందారు. చాలా మంది మద్యం మత్తులో వాహనాలు నడిపి, మద్యం సేవించడం, హెల్మెట్‌లు ధరించకపోవడం తదితర కారణాలతో మృతి చెందినట్లు పోలీసులు తెలుపుతున్నారు. 2023తో పోలిస్తే 2024లో రోడ్డు ప్రమాదాలు 3.20శాతం పెరిగాయి. కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేకంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన చట్టం సెక్షన్ 185 ద్వారా కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తారు. బ్రీత్ ఎనలైజర్ (మద్యం శాతం) రిజల్ట్ ఆధారంగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. బ్రీత్ ఎనలైజర్‌లో మద్యం శాతం 200 దాటితే ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


సమావేశమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


మత్తమాలలో మాట్లాడుతున్న సత్యనారాయణ


నందివాడలో సమావేశమైన కాంగ్రెస్ నేతలు

- పలు మండలాల్లో కాంగ్రెస్ సమావేశాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సాయికుమార్, అట్టెం శ్రీను పిలుపునిచ్చారు. గురువారం మాలోత్‌తండా, ఎక్కపల్లితండా, ముస్తాపూర్, ఎల్లారం, పర్మళ్ల, భవానిపేట, కోమట్‌పల్లి, సురాయిపల్లి, కొండాపూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు.

26 నుంచి రైతుభరోసా

ఎల్లారెడ్డిరూరల్: ఈ నెల 26 నుంచి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందించనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. గురువారం మత్తమాల, రుద్రారం, బ్రాహ్మణపల్లి, అల్మాజీపూర్ గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ..రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు సైతం రూ.12 వేలు అందిస్తుందన్నారు. మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్, వెంకట్రాంరెడ్డి ఉన్నారు.


సదాశివనగర్‌లో పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భారీ మెజార్టీతో గెలిపించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. నందివాడలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు లక్ష్మణచారీ, శివాజీ, రాజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ పరిధిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు అడ్లూర్ ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, నాయకులు ఇర్షాదొద్దిన్, సురేష్, రూపేందర్ రెడ్డి, సిద్ధిరాములు, సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొనారు.

తెలుగు ప్రజల ప్రత్యేక పండుగ సంక్రాంతి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణ తార

నస్రుల్లాబాద్(బాన్సువాడ): తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ప్రత్యేకమని జిల్లా బీజేపీ అధ్యక్షులు అరుణ తార అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రామాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతలేనని అన్నారు. ఎంత మంది పాల్గొన్నా గెలిచేది ఒక్కరేనన్నారు. ముగ్గుల పోటీల నిర్వహించిన బీజేపీ నేత శశాంక్‌ను అభినందించారు. ఉల్లెంగ సునంద మొదటి బహుమతి రూ.2516, రెండో బహుమతి వైష్ణవి రూ.1616, మూడో బహుమతి ప్రణీత రూ.1116 నగదు అందించి సన్మానించారు. మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, మహిళా మోర్చ అధ్యక్షులు సావిత్రి, నాయకులు మేకల రాములు, అరిగె నారాయణ, గుత్తుల శ్రీనివాస్, సాయాగౌడ్, శంకర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందిస్తున్న అరుణ తార

తప్పిపోయిన పిల్లలు, తల్లికి అప్పగింత

కామారెడ్డి టౌన్: రోడ్డు పక్కన ఏడుస్తూ ఉన్న ఇద్దరు చిన్నారులను గమనించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ వారిని తల్లికి వద్దకు చేర్చిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. అంచనూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి మున్సిపల్ కార్యాలయం పక్కన వీధిలో ఉన్న మీ–సేవ కేంద్రానికి పని మీద వచ్చింది. తల్లికి చెప్పకుండా ఆ ఇద్దరు చిన్నారులు అక్కడి నుంచి ఆడుకుంటూ మున్సిపల్ కార్యాలయం ముందు రోడ్డు వద్దకు వచ్చి అయోమయానికి గురయ్యారు. ఎటు పోవాలో తెలియక రోడ్డు పక్కన ఏడుస్తూ ఉండిపోయారు. అప్పుడే కార్యాలయంలోకి వస్తున్న చైర్‌పర్సన్ ఆ చిన్నారులను గమనించి దగ్గరకు తీసుకుని ఓదార్చింది. కాసేపు అక్కడే సిబ్బందితో పిల్లల వెంట వచ్చిన వారు ఎవరోనని వెతికించింది. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. 20 నిమిషాల తర్వాత తల్లి రావడంతో ఊపిరి పీల్చుకుని పిల్లన్ని అప్పగించారు. తల్లిని మందలించారు.


పిల్లలను ఓదార్చుతూ పోలీసులకు ఫోన్ చేస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ



రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం సభ్యులు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో నిర్వహించిన పసుపు రైతుల అవగాహన సదస్సుకు హాజరైన రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఘన స్వాగతం పలికారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


కోదండరెడ్డిని సన్మానిస్తున్న మానాల


స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హనుమంతు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కామారెడ్డి టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కౌన్సిలర్లు మమత, వంశీ, ఇమ్రాన్, ప్రిన్సిపాల్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు హరిజనవాడలో నూతన బోరు మోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. కౌన్సిలర్ పిడుగు మమత, కాలనీవాసులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం..

- రోజుకు టీఎంసీ చొప్పున తగ్గుముఖం
- కాలువల ద్వారా 11,704 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌లో కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్ నుంచి రోజుకు ఒక్క టీఎంసీ చొప్పున నీరు ఖాళీ అవుతోంది.

ప్రస్తుత యాసంగి సీజన్‌లో 15 రోజుల వ్యవధిలో 14 టీఎంసీల నీరు ఖాళీ అయింది. నీటి విడుదల ప్రారంభ సమయంలో రెండు రోజులు మాత్రమే టీఎంసీ కంటె తక్కువ నీటి వినియోగం జరిగింది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వార 700 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట ద్వారా 525 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్ట్ ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 416 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1087.00(66.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.